

# పుస్తక పరిచయం




‘కౌముది‘లో మూడేళ్ళపాటు ధారావాహికంగా వచ్చిన పసిడిమనసు శీర్షికలోని కథానికలే ఈ చిట్టెమ్మోరిల్లు(బార్లపూడి కతలు) పుస్తకరూపంలో తెలుగు పాఠకుల ముందుకు వచ్చాయి. రచయిత్రి షర్మిలగారు పెద్దెరిగే వరకూ మసలిన గ్రామం బార్లపూడి. ఆ వూళ్ళోని మనుషుల కథలివి. ఇందులోని ఏ కథా ఊహలోంచి పుట్టింది కాదు, ఇవన్నీ జీవమున్న మనుషుల గాథలే. ఆవూళ్ళో చిట్టెమ్మోరు అని అంతా పిల్చుకునే ఒకామె అందరికీ కావల్సిన ఆత్మీయురాలు, అందర్నీ ఆత్మీయులుగా చూసుకునే విశాల హృదయురాలు. ఈ కథలన్నింటిలో చిట్టెమ్మోరు అంతర్లీనంగా కనిపిస్తే, ఈ కథల్ని చెప్పే పసిడిమనసు మనల్ని అమాయకంగా, పలకరిస్తుంది. మనల్ని కథలు చెప్పమని అడగడం కాక , తానే తన బుల్లిమనసుతో చిట్టెమ్మోరు గురించి ఎన్నెన్నో కబుర్లు చెబుతుంది. అలాంటి మనసుల్లోకి పరకాయప్రవేశం చేసి, వాళ్ళ కళ్ళతో దశాబ్దాల క్రిందట సంఘటనలను ఊహించుకుంటూ, వాళ్ళ భాషలోనే కథానికలు వ్రాయడం అంత సులువైన విషయమేం కాదు. చిన్న పిల్లలు అనగానే వాళ్ళ భావాలూ, వాళ్ళకెదురయ్యే పాత్రలూ, సంఘటనలు కూడా పరిమితంగానే వుంటాయి. పరిమిత పరిధికి లోబడి, ఒకటి రెండు పేజీల్లో కొసమెరుపు కథలు వ్రాయడం అనే సవాల్‌ని సమర్ధవంతంగా అధిగమించారు షర్మిలగారు. ఈ పుస్తకంలోని ఒక్కొక్క జ్ఞాపకాన్ని తడుముతూ వెళ్తే.. - వెన్నపూసలాంటి మనసున్న చిట్టెమ్మని వదల్లేక, కొనుక్కున్నవాడిని ఎదిరించి వెనక్కి వచ్చేసిన పెద్ద గేదె ‘మా యింట మా లచ్చిమి‘ కళ్ళ ముందు నిలుస్తుంది, చిన్నారి వద్దంటున్నా మమకారం పంచడం మానుకోని సొమ్మమ్మ ఎదురొస్తుంది, మనసు గాయపడ్డ రాజమ్మ నుంచీ ‘పాలపిట్ట రంగు చీర‘ లాగేసుకున్న చిన్నారి పలకరిస్తుంది, ‘అమ్మడు‘ కి అవాజ్యమైన ప్రేమ పంచిన మస్తాన్ వలి మాస్టారు కళ్ళజోడు తుడుచుకుంటూ కనిపిస్తారు, ఎన్ టీ ఓడంత పౌరుషం వున్న మన్నాన్న రక్తసంబంధం తీపిని రుచి చూపిస్తాడు..ఒకరా..ఇద్దరా..!! ఈ కథల్లో అడుగడుగునా కనిపించే పాత్రలన్నీ సజీవంగా మన మనసుల్లో కొలువుండిపోతాయి.! ముఖ్యంగా పల్లె జీవితాల అమాయకత్వాన్ని ప్రతిబింబించే భాష, పంటకాలువ మీదుగా వీచే పైరగాలిని గుర్తుకు తెస్తుంది. తెలుగు భాషలోని మాండలీకపు తియ్యదనాన్ని అడుగడుగునా రుచి చూపిస్తుంది.. శ్రీకృష్ణుడు నోటిలో బ్రహ్మాండాన్ని చూపించినట్లు, అతి చిన్న ప్రక్రియలో అద్భుతమైన భావోద్వేగాల రంగుల పండుగల్ని చిత్రించిన షర్మిలగారి రచనా నైపుణ్యాన్ని అభినందించి తీరాలి. ★★★

ప్రచురణ
వికాస ధాత్రి
బి - 74 దయాల్ నగర్,
విశాఖపట్నం - 530 043
ఫోన్: 944 099 4244
www.vikasadhatri.org



# పుస్తక పరిచయం




'దైవంతో నా అనుభవాలు (నా ఆధ్యాత్మిక ప్రయాణం)' పుస్తకంలో వెంకట వినోద్ పరిమిగారి స్వానుభవాలకు యం. రమేష్ కుమార్ గారు అక్షర రూపం ఇచ్చారు. పుస్తకం పేరు చూడగానే ఇందులోని అంశాల గురించిన ఒక స్పష్టమైన అవగాహనకు రావొచ్చు. ఇవి వెంకట వినోద్ గారికి తన జీవిత ప్రయాణంలో ఎదురైన వింత, వింత అనుభవాలు. కొన్నిసార్లు కలలో కనిపించిన దృశ్యాలు సంఘటనలు నిజజీవితంలో ఎదురవ్వడం, లేదా నిజ జీవితంలోనే విచిత్రమైన వ్యక్తులు కొద్ది నిమిషాలు కనిపించి ఓ అద్భుతాన్ని చూపించి మళ్ళీ కనిపించకపోవడం - ఇలాంటి సంఘటనల సమాహారం ఈ పుస్తకం. వీటిని పాఠకుల ముందు ఉంచడంలో వెంకట వినోద్‌గారి నిజాయితీని మెచ్చుకోవాలి. ముందుమాటలో ఆయన వ్రాశారు "జరిగిన సంఘటనలకు అక్షరరూపమిస్తూ నేను నిజాయితీగా రాసుకున్న పుస్తకం. అయితే ఇందులో కొన్ని విషయాలు మీకు నమ్మశక్యంగా అనిపించకపోవచ్చు. కల్పితాలేమో అన్న సందేహం రావచ్చు. ఫర్వాలేదు..కల్పితం అనుకునే చదవండి. ఈ విషయంలో మిమ్మల్ని ఏదో విధంగా నమ్మించాలన్న ఆలోచన నాకు లేదు. ఇవన్నీ నేని నిజాయితీగా రాసుకున్న అంశాలని ముందుగానే మనవి చేశాను" అని. అలానే ఈ అనుభవాలకు అక్షరరూపమిచ్చిన రమేష్ కుమార్ గారు " భగవంతుడు అంటే నా ఉద్దేశ్యం దైవం కావొచ్చు లేదా ఒక ధనాత్మకశక్తి కావొచ్చు. ఆ శక్తి తన నిజాయితీ, స్వచ్ఛత, సహాయం చేసేగుణం, మనస్సాక్షి ప్రకారం నడుచుకోగలిగే ధైర్యం కారణంగా అతడికి లభించింది. అలాంటి ధనాత్మకశక్తి అతడి చుట్టూ ఒక కవచంలాగా ఆవరించుకుని ఉందని నా భావన" అని వ్రాసారు ముందుమాటలో. అనుభవించిన వెంకట వినోద్ గారు, అక్షరీకరించిన రమేష్ కుమార్ గారు - దైవం పట్ల తమ అభిప్రాయాలను, భావాలను ఇంత స్పష్టంగా, స్వచ్ఛంగా, నిజాయితీగా ప్రకటించడం ఎంతైనా మెచ్చుకోదగ్గ విషయం. ఇందులోని ప్రతి అనుభవమూ ఒక చక్కటి కథలా సాగింది. వ్రాసిన శైలికూడా సరళంగా ఉండడంతో ప్రతి ఖండికా పాఠకుడ్ని ఆ వాతావరణంలోకి తీసుకెళ్తుంది. ప్రతి చోటా కాలమూ, స్థలమూ చెప్పడంతో వీటిలో ఒక సాధికారత కనిపిస్తుంది. వెంకట వినోద్ గారు ముందు చెప్పినట్లే ఇందులోని అనుభవాలతో పాఠకుడు ఏకీభవించినా లేకపోయినా ఆసక్తికరంగా సాగిన ఈ అనుభవాల పరంపర ఒక అనుభూతినైతే మిగల్చగలదు. ***

**Author**
**M. Ramesh Kumar**
email: kumarmr2012@gmail.com
Phone No.s : +91 94924 54678 & +91 83095 54170

ఈ శీర్షికలో తమ పుస్తక పరిచయాలు ప్రచురింపబడాలనుకునే వారు, తమ పుస్తకాలు ఒక్కొక్క కాపీని క్రింది ఎడ్రసుకి మెయిల్ చెయ్యవలసిందిగా 'కౌముది' విజ్ఞప్తి చేస్తోంది.

**Editor,**
**KOUMUDI (Web Monthly)**
**4251 - Escudo Ct**
**Dublin - CA 94568, USA**